కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



ధర్నా చేస్తున్న ఉద్యోగులను అరెస్టు చేస్తున్న పోలీసులు

సుల్తాన్‌బజార్: వైద్య ఆరోగ్యశాఖలోని వివిధ విభాగాల్లోన్ని కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న మొత్తం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని అలాగే సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరుతూ తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ ఫసియుద్దీన్ ప్రధాన కార్యదర్శి కె.యాదనాయక్ డిమాండ్ చేశారు. గురువారం కోఠి డీఎంహెచ్ఎస్ క్యాంపస్‌లో వివిధ విభాగాలలో పనిచేస్తున్న 2వ ఏఎన్ఎంలు, ఈసీ ఏఎన్ఎంలు, 104 ఉద్యోగులు, శానిటేషన్ సెక్యూరిటీ, పేషంట్‌కేర్ తదితర ఉద్యోగులతో యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా గందరగోళానికి దారితీసింది. వారు వైద్య ఆరోగ్యశాఖ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ కార్యాలయానికి చొచ్చుకొని వెళ్తుండడంతో సుల్తాన్‌బజార్ పోలీసులు భారీ బలగాలను మోహరించి వారిని అడ్డుకుని అరెస్టులు చేసి బండ్లగూడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఫసియుద్దీన్, కె.యాదానాయక్ మాట్లాడుతూ..వైద్య ఆరోగ్యశాఖలోని డీఎంఈ, డీహెచ్, వైద్య విధాన పరిషత్, టీసాక్స్ తదితర విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను యధావిధిగా రెగ్యులర్ చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను అసెంబ్లీ చర్చించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం కోశాధికారి కవిత, నాయకులు బలరాం, విజయవర్ధన్‌రాజు, కిరణ్మయ్, ప్రవీణ్‌కుమార్, సుధాకర్, శ్రీనివాస్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

గోల్కొండ ఆసుపత్రిలో వైద్యులను వెంటనే నియమించాలి



మంత్రి దామోదర రాజనర్సింహకు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకురాలు శోభాపాండే

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో సీనియర్ వైద్యులను ఒకేసారి బదిలీ చేయడంతో పేషంట్లు ఇబ్బందులు పడుతున్నారని, ఖాళీ అయిన పోస్టులను వెంటనే డాక్టర్లతో భర్తీ చేయాలని కాంగ్రెస్ నాయకురాలు శోభాపాండే కోరారు. ఈ మేరకు ఆమె గురువారం మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి వినతిపత్రం అందజేశారు. గోల్కొండ ఆసుపత్రిలో ఒకేసారి జనరల్ ఫిజిషియన్, సివిల్ సర్జన్, ఆర్థోపెడిక్ డాక్టర్‌తో పాటు సీనియర్ డాక్టర్ల బదిలీలు జరిగాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. సీనియర్ల బదిలీలతో పేషంట్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జనరల్ మెడిసిన్ సర్జన్ పోస్టులు ఖాళీ అయ్యాయని ప్రస్తుతం ఆసుపత్రిలో ఆపరేషన్‌లు పూర్తిగా ఆగిపోయాయని గత్యంతరం లేక పేషంట్లు ఉస్మానియాకు పరుగులు తీస్తున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. బదిలీ అయిన స్థానాల్లో త్వరలోనే నియమిస్తామని మంత్రి దామోదర రాజనర్సింహ్మ అన్నారు.

భక్తిశ్రద్ధలతో 8వ బోనం



మహంకాళి అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న పూజారి సురేష్‌చారి

గోల్కొండ: అమ్మవారి భక్తిగీతాలతో గోల్కొండ కోట దద్దరిల్లింది. గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి ఆషాఢ మాసం బోనాల ఉత్సవాల సందర్భంగా గురువారం అమ్మవార్లకు బోనం పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారి దర్శనానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. కోటలోని నగీనాబాగ్, నగీనాబ్యారెక్స్ ప్రాంతాలు ఉదయం నుంచే సందడిగా మారాయి. నగీనాబ్యారెక్స్‌లో సంప్రదాయ దుస్తులతో సందడి చేయగా మరికొందరు నాగదేవత పుట్టకు పూజలు నిర్వహించారు. అనంతరం ప్రజలు తలలపై బోనం కుండలతో శివసత్తులతో కలిసి కోటపైకి వెళ్లారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి ఈ.శ్రీనివాసరాజు పర్యవేక్షణలో అమ్మవార్లకు పూజా కార్యక్రమాలు జరిగాయి. మహంకాళి ఆలయంలో ఆలయ పూజారి బి.సురేష్‌చారి పూజలు నిర్వహించారు. గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ పర్యవేక్షణలో గోల్కొండ ఇన్‌స్పెక్టర్ సైదులు బందోబస్తు పర్యవేక్షించారు.

శుభాకాంక్షలు



నాంపల్లి: తెలంగాణ నూతన గవర్నర్‌గా నియమితులైన జిష్ణుదేవ్ వర్మను కాంగ్రెస్ నాయకుడు పాశం రాజేందర్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు గురువారం రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో పాటుగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు.

నియామకం

చార్మినార్: నార్నౌల్ అగర్వాల్ సమితి హైదరాబాద్ ప్రధాన కార్యదర్శిగా పాతబస్తీకి చెందిన తరుణ్ కుమార్ అగర్వాల్ నియమితులయ్యారు. ఈ మేరకు సమితి అధ్యక్షుడు పంకజ్ కుమార్ అగర్వాల్ ఆయనకు గురువారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పంకజ్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ.. సామాజిక సేవా కార్యక్రమాల్లో నార్నౌల్ అగర్వాల్ సమితి నిరంతరం కృషి చేస్తుందన్నారు. రమేష్ అగర్వాల్, రోహిత్ అగర్వాల్, అనూప్ అగర్వాల్, డాక్టర్ సరిత అగర్వాల్, అనిల్ దాదు, కమల్ అగర్వాల్ పాల్గొన్నారు.



నియామకపత్రం అందుకున్న తరుణ్ కుమార్ అగర్వాల్

సుప్రీంకోర్టు తీర్పుపై దళిత నాయకుల హర్షం



ఛత్రినాకలో మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నర్సింహా స్వామి

చాంద్రాయణగుట్ట: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు దేశ అతున్నత న్యాయస్థానం ఆమోదం తెలపడంపై చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలోని దళిత సంఘాలతో పాటు బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఎస్సీ సంఘాల నాయకులు అంబేడ్కర్‌కు నివాళులర్పించగా, బీజేపీతో కొన్ని ఎస్సీ సంఘాల వారు దేశ ప్రధాని నరేంద్ర మోదీ, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ చిత్ర పటాలకు పాలాభిషేకాలు నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు ఆమోదిస్తూ తీర్పును ఇవ్వడంపై ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.ఎం.నర్సింహ స్వామి, బండి నరేష్, బీజేపీ నాయకులు ప్రధాని మోదీ, మంద కృష్ణ మాదిగ చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. ఎస్సీ డెవలప్‌మెంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు పులికంటి నరేష్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు.

పారిశుద్ధ్యం..అస్తవ్యస్తం

- శాతం చెరువు వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం
- పట్టించుకోని అధికారులు
- రోగాల బారిన పడుతున్న స్థానికులు



శాతం చెరువు వద్ద..

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలోని కార్వాన్, టోలిచౌకీ, నానల్‌నగర్, లంగర్‌హౌస్, గోల్కొండ తదితర డివిజన్లలో పారిశుద్ధ్యం పనులు పూర్తిగా అస్తవ్యస్తంగా మారాయి. టోలిచౌకీ చౌరస్తా, శాతం చెరువు, హకీంపేట్ బుల్కాపూర్ నాలా, గోల్కొండ కందకాలు, షేక్‌పేట్ ఎర్రకుంట చెరువు, కొత్త చెరువుల వద్ద చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. పారిశుద్ధ్య సిబ్బంది చెత్త కుప్పలను ఎప్పటికప్పుడు తరలించకుండా రోజుల తరబడి అలాగే వదిలేస్తున్నారు. దీంతో చెత్త వర్షాలకు కుళ్లి దుర్గంధభరితంగా తయారయ్యాయి. వీటి నుంచి దోమలు వృద్ధి చెంది స్థానికులు డెంగీ, మలేరియా వంటి రోగాల బారిన పడుతున్నారు.

కాన రాని అధికారులు...

బల్దియా మలేరియా విభాగంలోని అసిస్టెంట్ ఎంటమాలజీస్టు స్థాయి అధికారులు ఎక్కడ ఉంటారో వారిని ఎలా కలుసుకోవాలో తెలియని పరిస్థితి ఉంది. ఫోన్‌లపై కూడా ఈ అధికారులు అందుబాటులో ఉండడం లేదు. ఎలాగో అలా ఫోన్ నెంబర్ సంపాదించి ఫోన్ చేస్తే తాము బిజీగా ఉన్నామంటూ దురుసుగా జవాబు ఇస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రజాధనంతో జీతాలు పొందుతూ ప్రజల ఆరోగ్యాన్ని మంటగలుపుతున్న అధికారులు తమ వైఖరిని మార్చుకోవాలని పలువురు అంటున్నారు.

మారుబోనంతో ముగిసిన పాతబస్తీ బోనాలు



గాజుల అంజయ్య దంపతులను సత్కరిస్తున్న బంగారు మైసమ్మ ఆలయ కమిటీ ప్రతినిధులు

చార్మినార్: పాతబస్తీలో బోనాల ఉత్సవాలను వైభవంగా ముగిశాయి. ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని నగరంలో నిర్వహించిన సప్తమాతృకలకు సప్త బంగారు బోనంతో ఈసారి పాతబస్తీలో ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాల సందడి మొదలైంది. గత నెల 29న నిర్వహించిన సామూహిక ఘటాల ఊరేగింపుతో పాటు బుధ, గురు వారాల్లో నిర్వహించిన మారు బోనంతో ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలు ముగిశాయి. ఘనంగా నిర్వహించిన బోనాల జాతర ఉత్సవాల హడావుడి పాతబస్తీలో రెండు నెలల పాటు కొనసాగింది. ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక వాతావరణం కనిపించింది. ప్రభుత్వంలోని వివిధ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు, అధికారులు, కిందిస్థాయి సిబ్బంది సమన్వయంతో పని చేయడంతో బోనాల ఉత్సవాలు చక్కగా కొనసాగాయి. ఉత్సవాలను పురస్కరించుకొని దక్షిణ మండలం పోలీసులు అదనపు బలగాలతో ఎప్పటికప్పుడు శాంతి భద్రతలను పర్యవేక్షించారు. దేవాదాయ శాఖతో పాటు విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానం ఆధ్వర్యంలో పాతబస్తీలోని ప్రధాన అమ్మవారి ఆలయాలకు ఆషాఢ మాసం సారే, పట్టు వస్త్రాలను సమర్పించారు. విజయవాడ, ఢిల్లీ నగరాల్లో బోనాల జాతర ఉత్సవాలను నిర్వహించి తెలంగాణ, సంస్కృతి సంప్రదాయాలను చాటి చెప్పారు.

కనుల పండువగా సప్త మాతృకల సప్త బంగారు బోనం..

భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు గాజుల అంజయ్య ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి రెండు నెలల ముందుగానే తగిన ఏర్పాట్లు చేశారు. సప్తమాతృకలకు సప్త బంగారు బోనంలో భాగంగా గోల్కొండ అమ్మవారికి, బల్కంపేట అమ్మవారికి, పెద్దమ్మ గుడి అమ్మవారికి, సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి, చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారికి, లాల్‌దర్వాజా సింహవాహిని అమ్మవారికి, మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో అమ్మవారికి బంగారు బోనం సమర్పించారు. ఇక ఈసారి సిల్వర్ జూబ్లీ బోనాల ఉత్సవాలు నిర్వహించిన హరిబౌలిలోని బంగారు మైసమ్మ ఆలయం అమ్మవారికి సైతం బంగారు బోనం, పట్టు వస్త్రాలు అందజేశారు. బోనాల ఉత్సవాలు ప్రశాంతంగా ముగియడంతో గాజుల అంజయ్య దంపతులను హరిబౌలిలోని బంగారు మైసమ్మ ఆలయ కమిటీ ప్రతినిధులు గురువారం ఘనంగా సన్మానించారు.

సహకరించిన వారందరికీ ధన్యవాదాలు

బోనాల ఉత్సవాలు ప్రశాంతంగా ఆనందోత్సాహాలతో ముగియడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కమిటీ తరఫున ధన్యవాదాలు. ఘటాల ఊరేగింపు సందర్భంగా ఉత్సవాల నిర్వాహకులు, అధికారులు తమతో పూర్తిగా సహకరించడంతో ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. పాతబస్తీలో నిర్వహించిన ఘట స్థాపన సామూహిక ఊరేగింపుతో పాటు అమ్మవారి బోనాల సమర్పణ, అమ్మవారి ఘటాల సామూహిక ఊరేగింపులకు సహకరించిన ఉత్సవాల నిర్వాహకులతో పాటు ప్రభుత్వంలోని వివిధ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బందికి ధన్యవాదాలు.

– గాజుల అంజయ్య, ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు

ఆత్మీయ వీడ్కోలు



విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలికి వీడ్కోలు పలుకుతున్న విద్యార్థులు

గోల్కొండ: గోల్కొండ ప్రభుత్వ తెలుగు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా పదవీ విరమణ పొందిన వై.ఎస్.అనురాధాదేవిని ఆ పాఠశాల విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికి స్థానికులచే ఔరా అనిపించుకున్నారు. గురువారం ప్రధానోపాధ్యాయురాలిని పూలమాలలు, శాలువాలు వేసి సన్మానించారు. అనంతరం గోల్కొండ బడాబజార్‌లోని పాఠశాల నుంచి ఊరేగింపు తీశారు. ఈ సందర్భంగా పదవీ విమరణ పొందిన ప్రధానోపాధ్యాయురాలితో పాటు ఆమె తోటి ఉపాధ్యాయుల బృందం సైతం కన్నీటి పర్యంతరం అయింది.ఈ వీడ్కోలు ఊరేగింపులో ఉపాధ్యాయులు ఎస్.సుబ్బారావు, లక్ష్మారెడ్డి, రాజకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

'వైద్య ఆరోగ్యశాఖలో లెక్కకు మించి గణాంక అధికారుల బదిలీలు'

సుల్తాన్‌బజార్: వైద్య ఆరోగ్యశాఖలో 17 మంది గణాంక అధికారులు పనిచేస్తుండగా వారిలో 40 శాతం మంది బదిలీలకు అర్హులు కాగా 60 శాతం అధికారులను బదిలీలు చేసి ప్రభుత్వ ఉత్తర్వులను అధికారులు ఉల్లంఘించారని గణాంక అధికారుల సంఘం నాయకులు నాగమల్లేశ్వర్‌రావు, పి.కృష్ణ, ఎస్.కృష్ణవేణి, ఎల్లమ్మ తదితరులు వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఆర్‌వి.కర్ణన్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మల్టీజోన్ 2 పరిధిలో 17 మంది గణాంక అధికారులు ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 40 శాతం అంటే 7 మంది అధికారులను బదిలీ చేయాల్సి ఉండగా ఏకంగా 60 శాతం అంటే 10 మంది గణాంక అధికారులను బదిలీలు చేపట్టారని వారు తెలిపారు. అనర్హులైన ముగ్గురు గణాంక అధికారులను బదిలీ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు. ఈ విషయమై కమిషనర్ దృష్టికి తీసుకువెళ్తే ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.

విద్యుత్ కేబుల్ వైర్ల పనుల ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్

యాకుత్‌పురా: విద్యుత్ సమస్య పరిష్కారానికి నూతన కేబుల్ వైర్లు ఏర్పాటు చేస్తున్నామని రెయిన్‌బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్ అన్నారు. డివిజన్‌లోని ఇమామ్‌బాడ, ఎస్ఆర్టీ కాలనీలో నూతన ఏర్పాటు చేయనున్న విద్యుత్ కేబుల్ పనులను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కొన్ని రోజులుగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలు తలెత్తున్నాయన్నారు. దీంతో నూతన కేబుల్ వైర్లను అమర్చనున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ పార్టీ ఏరియా కమిటీ అధ్యక్షుడు, టీజీ ఎస్పీడీసీఎల్ అధికారులు పాల్గొన్నారు.

'ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుంది'



దేవర శ్రీనివాస్

గోల్కొండ: తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ ఆరోపించారు. ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి గాలికి వదిలేశారని అన్నారు. రైతు రుణమాఫీ అంటూ రైతులను నిండా ముంచుతున్నారని ఆయన ఆరోపించారు. సాధారణ మహిళలతో పాటు ప్రజాప్రతినిధ మహిళలను సైతం కించపరిచే విధంగా మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నియంతలా వ్యవహరిస్తున్నారన్నారు. పదేళ్ల రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్‌కు రాష్ట్ర ప్రజలు పూర్తిగా తిరస్కరించి చెత్తబుట్టలో వేశారన్నారు. కాంగ్రెస్‌ను కూడా అదే గతి పట్టడం ఖాయమన్నారు.

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న సయ్యద్ అసదుద్దీన్ తదితరులు

అబిడ్స్: తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని టీఎన్జీఓస్ యూనియన్ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని తనయుడు సయ్యద్ అస్సదుద్దీన్ ఆధ్వర్యంలో పవిత్ర పుణ్యక్షేత్రమైన మక్కా మదీనాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గురువారం నగరానికి వచ్చిన సయ్యద్ అసదుద్దీన్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఉద్యోగులు అన్ని రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా ఉండాలని కోరారు. దేశ నలుమూలలా ప్రతి రంగంలో తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానంలో ఉండే విధంగా ప్రార్థనలు నిర్వహించామని తెలిపారు. ఆయనతో పాటు సయ్యద్ నవాజ్‌ఉద్దీన్, బిలాలుద్దీన్ పాల్గొన్నారు.

సన్మానం



మసూద్ అహ్మద్‌ను సత్కరిస్తున్న ప్రవీణ్‌కుమార్, లక్ష్మీనారాయణ

అబిడ్స్: పదవీ విరమణ చేయడం ప్రతి ఉద్యోగికి సహజమని హైదరాబాద్ మెట్రోబోర్డు పర్సనల్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎంప్లాయిస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ జి.లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. వాటర్‌బోర్డులో పదవీ విరమణ పొందిన మసూద్ అహ్మద్‌ను ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..వాటర్‌బోర్డులో మసూద్ అహ్మద్ చేసిన సేవలు అమోఘమని కొనియాడారు. 30 ఏళ్లకు పైగా విధులు నిర్వహించిన మసూద్ అహ్మద్ అందరిచేత శభాష్ అనిపించుకున్నారని ప్రవీణ్ కుమార్, లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపి ఖాదర్, మహ్మద్ షకీల్ తదితరులు పాల్గొన్నారు.

బస్తీల్లో ఫాగింగ్ నిర్వహించండి

శాలిబండ: శాలిబండ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో దోమలు స్వైర్య విహారం చేస్తున్నాయి. జీహెచ్ఎంసీ సిబ్బంది చెత్తాచెదారాన్ని రోజువారీగా తీయకపోవడంతో దోమలతో పాటు ఈగలు వృద్ధి చెందుతున్నాయి. దీంతో డెంగీ, మలేరియా తదితర వ్యాధులు ప్రబలే అవకాశముందని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. తమ బస్తీల్లో కనీసం వారంలో రెండుసార్లు అయినా దోమల నివారణ కోసం ఫాగింగ్ నిర్వహించాలని కోరుతున్నారు. డివిజన్‌లోని ఖాజీపురా, హిమ్మత్‌పురా, ఫతేదర్వాజా కాలనీల్లో వెంటనే అధికారులు ఫాగింగ్ నిర్వహించాలని కోరుతున్నారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్‌గా చంద్రశేఖర్



విజయనగర్‌కాలనీ: మాసబ్ ట్యాంక్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కె.చంద్రశేఖర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. వనపర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన రాజేశ్వరీదేవి నారాయణ్‌ఖేడ్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు బదిలీ అయ్యారు.

'నిరుద్యోగుల జాబ్ కేలండర్ ప్రకటించడం దేశంలోనే రికార్డు'



గౌరీ సతీష్

అఫ్జల్‌గంజ్: నిరుద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం జాబ్ కేలండర్ ప్రకటించడం దేశంలోనే రికార్డు అని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ పేర్కొన్నారు. నిరుద్యోగులు గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మోసానికి, దగకు గురయ్యారన్నారు. గ్రూప్–1 పరీక్ష నిర్వహించిన బీఆర్ఎస్ ప్రభుత్వం పేపర్ లీకేజ్ చేయించి లక్షలాది మంది నిరుద్యోగులను రోడ్డుపాలు చేసిందన్నారు. గత ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం గురువారం జాబ్ కేలండర్‌ను ప్రకటించారని ఆయన అన్నారు. మెగా డీఎస్సీతో పాటు అన్ని విధాల ఉద్యోగాలను నిరుద్యోగుల కోసం ప్రభుత్వం అంచెలంచెలుగా విడుదల చేస్తుందన్నారు. అభివృద్ధి, సంక్షేమం, నిరుద్యోగులకు అండగా ఉండడం, అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతుందని గౌరీ సతీష్ పేర్కొన్నారు.

లారీ డ్రైవర్ అదృశ్యం



మహ్మద్ ఉస్మాన్

గౌలిపురా: పని నిమిత్తం బెంగళూర్ వెళ్లిన ఓ లారీ డ్రైవర్ అదృశ్యమైన ఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం .. తలాబ్‌కట్టా రోడ్డు నంబర్–11 ప్రాంతానికి చెందిన మహ్మద్ ఉస్మాన్ (50), నూర్జాహాన్ బేగం దంపతులు. వీరికి ముగ్గురు ఆడ పిల్లలు సంతానం ఉన్నారు. గత నెల 16న పని నిమిత్తం మహ్మద్ ఉస్మాన్ మలక్‌పేట్‌కు వెళ్లాడు. అనంతరం 17న మహ్మద్ ఉస్మాన్ తన భార్య నూర్జాహాన్ బేగంకు ఫోన్ చేసి ఆర్డర్ పని నిమిత్తం బెంగళూర్ వెళ్తున్నానని చెప్పాడు. అనంతరం తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో ఆందోళన చెందిన భార్య స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

నాంపల్లి: ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన హబీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 55 ఏళ్ల వయస్సు కలిగిన ఓ గుర్తు తెలియని వ్యక్తి శవం లభించింది. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడి ఒంటిపై స్వల్ప గాయాలు ఉన్నట్లుగా తెలుస్తోంది. అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారా లేక ఇతరత్రా కారణాలేమైనా ఉన్నాయా అనే కోణంలో కూడా పోలీసులు విచారిస్తున్నారు. మృతుడు నలుపు రంగు చొక్కా ధరించినట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వాటర్‌బోర్డులో పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న పోల్కం శ్రీనివాస్

అబిడ్స్: మెట్రో వాటర్‌బోర్డులో కాంట్రాక్టర్లకు రావాల్సిన పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర కాంట్రాక్టర్స్ జేఏసీ చైర్మన్, రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ జనరల్ సెక్రెటరి పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. కొన్ని సంవత్సరాల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వాటర్‌బోర్డులో పనిచేసిన కాంట్రాక్టర్లకు కోట్లాది రూపాయాల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ మేరకు గురువారం నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు శ్రీనివాస్ వినతిపత్రం అందజేశారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ..వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డికి కాంట్రాక్టర్ల పాత బకాయిలు చెల్లించే విధంగా ఆదేశాలు జారీ చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్టర్లకు అండగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందించారు. కాంట్రాక్టర్ల పాత బకాయిలు ఇప్పించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి



బజ్జుగోప్, విజయ్‌చౌదరీలకు మెమెంటోలు అందజేస్తున్న శ్రీనివాస చారి

అబిడ్స్: ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బజ్జుగోప్, విజయ్‌చౌదరీ పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతిని, సంప్రదాయాలను చాటేవిధంగా బోనాల ఉత్సవాలకు ప్రభుత్వం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసిందన్నారు. గురువారం చుడిబజార్ బోనాల ఉత్సవాల నిర్వాహకుడు శ్రీనివాస్‌చారి వారికి అమ్మవారి మెమొంటోలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బజ్జుగోప్, విజయ్‌చౌదరీలు మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అన్నివర్గాల ప్రజలు సుఖఃసంతోషాలతో ఉన్నారన్నారు.

శ్మశాన వాటికలో అభివృద్ధి పనులు ప్రారంభం



స్లాబ్ పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న శ్యాంరావు ముదిరాజ్

చాంద్రాయణగుట్ట: నల్లవాగులోని హిందూ శ్మశాన వాటికలో రూ.18 లక్షల వ్యయంతో చేపట్టిన వెయిటింగ్ హాల్ స్లాబ్ పనులను కాంగ్రెస్ గ్రేటర్ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాశమోని శ్యాంరావు ముదిరాజ్, భాగ్యనగర్ బ్యాగరీ సంఘం అధ్యక్షుడు పేరోజీ సాయినాథ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సమస్యలకు ప్రత్యేక నిధులు మంజూరు చేస్తుండడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ సందీప్, ఏఈ కుమార్, అశోక్ కుమార్, సాయిలు, దీపక్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

అనవసరంగా రోడ్లపైకి వస్తే కఠిన చర్యలు

సంతోష్‌నగర్: ఐ.ఎస్.సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం రాత్రి ఐ.ఎస్.సదన్ ఇన్‌స్పెక్టర్ వెంకటరామయ్య తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో ఉన్న హోటళ్లు, పాన్‌షాపులు, వైన్స్ షాపులను సమయానికి మూసి వేయాలని సూచించారు. అనంతరం అర్ధరాత్రి వేళల్లో రోడ్లపై తిరుగుతున్న యువకులను పిలిపించి ఆరా తీసి కౌన్సెలింగ్ నిర్వహించారు. అనవసరంగా రోడ్లపైకి వస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



వాహనాలను తనిఖీలు చేస్తున్న ఇన్‌స్పెక్టర్ వెంకటరామయ్య


బాక్సింగ్ క్రీడాకారుడికి సన్మానం



నితిన్‌రెడ్డిని సన్మానిస్తున్న ఏక్తా జనశక్తి ఫౌండేషన్ సభ్యులు

యాకుత్‌పురా: క్రీడల్లో మెరుగైన ఫలితాలు సాధించి ఇండియన్ మర్చంట్ నేవీలో ఉద్యోగంలో సంపాదించిన బాక్సింగ్ క్రీడాకారుడిన ఏక్తా జనశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం సన్మానించి ఆభినందనలు తెలిపారు. చదువులో రాణించి బాక్సింగ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఇండియన్ మర్చంట్ నేవీలో ఉద్యోగం సాధిన నీతిన్‌ను కోచ్ ప్రదిప్, ఫౌండేషన్ సభ్యులు, ఇతర క్రీడాకారులు ఆభినందనలు తెలిపి శుభాకాంక్షలు తెలియజేశారు.

తెలంగాణ క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలి



గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర క్రీడాకారులు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని తెలంగాణ త్రో బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.నవీన్‌యాదవ్ అన్నారు. గురువారం తెలంగాణ త్రో బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బెంగళూర్‌లో జరుగనున్న జాతీయ స్థాయి త్రో బాల్ పోటీలకు హాజరవుతున్న క్రీడాకారులకు కిట్లను అందజేశారు. అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి జగన్‌మోహన్ గౌడ్, కిరణ్‌చారి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9010221230
9010463222
9553955684